
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
26-8-2026 (Wednesday) MAIN EDITION

## కృతి సనన్ యాడ్ తొలగింపు



**అక్షరటుడే, ముంబై:** కృతి సనన్ నటించిన ‘రక్షా బంధన్ యాడ్’ను ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జీవ’ తొలగించింది. ఈ యాడ్‌లో ఆమె ధరించిన దుస్తులపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో సదరు సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పండగలపై మాకు ఎంతో గౌరవం ఉందని సంస్థ పేర్కొంది. తమ యాడ్‌తో కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతినడంతో ప్రకటనను తొలగిస్తున్నట్లు తెలిపింది.

## ఎస్ఐఆర్‌పై రేపు గ్రామసభలు




**అక్షరటుడే, హైదరాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ సభలు నిర్వహిస్తారు. ముసాయిదా ఓటరు జాబితాను చదివి వినిపిస్తారు.

## నేపాల్‌ను ముంచెత్తిన వరదలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో రసువా జిల్లాలో అపారనష్టం వాటిల్లింది. హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్ ధ్వంసం కావడంతో పాటు ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోయింది. బోటే కోశీ నదికి వరదలతో పలువురు గల్లంతు అయ్యారు. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

## కుప్పకూలిన భవనం



**అక్షరటుడే, ఏపీ :** తిరుపతిలో మూడు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఒక్కసారిగా భవనం కూలడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అని సహాయక బృందాలు గాలిస్తున్నాయి.

## టాలీవుడ్ డైరెక్టర్ అరెస్ట్



**అక్షరటుడే, సినిమా డెస్క్:** టాలీవుడ్ డైరెక్టర్ పవన్ సాదినేనిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెళ్లి పేరుతో మోసం చేశాడని ఓ నటి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి పవన్ తనను మోసం చేశాడని నటి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. గైనకాలజీ విభాగం వార్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ప్రమాదంలో వార్డులో చికిత్స పొందుతున్న 15 మంది నవజాత శిశువులు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఎయిర్ కండిషనర్ యూనిట్‌లోని ఆక్సిజన్ కంప్రెసర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.


## మందులను కూడా వదలని కేటుగాళ్లు..

**అక్షరటుడే, ఢిల్లీ :** క్యాన్సర్‌తో పోరాడుతున్న ప్రాణాపాయ స్థితిలోని రోగుల బలహీనతను ఆసరాగా చేసుకుని కోట్లాది రూపాయల దందాకు తెరలేపిన భారీ అక్రమ నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ బట్టబయలు చేసింది. రూ. లక్ష వరకు వెచ్చించి కొనుగోలు చేసే ‘ఎవాల్యుమాబ్’ క్యాన్సర్ నిరోధక ఇంజెక్షన్లలో కేవలం నీళ్లు మాత్రమే ఉన్నట్లు జర్మనీకి చెందిన ‘మెర్క్ ల్యాబ్’ పరీక్షల్లో తేలింది. ఇందులో క్యాన్సర్‌ను అణచివేసే అసలైన ఔషధ పదార్థం శూన్యమని వెల్లడైంది. అంతేకాకుండా, రాజస్థాన్ ప్రభుత్వ పథకం కింద ఉచితంగా అందించాల్సిన క్యాన్సర్ మందులను కూడా ఈ ముఠా అక్రమ మార్గంలో మార్కెట్లోకి తరలించి విక్రయించినట్లు దర్యాప్తులో స్పష్టమైంది.

# ఘోర రోడ్డు ప్రమాదం

**సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందగా.. మరికొందరు గాయపడ్డారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




■ కంటైనర్‌ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు ■ ఆరుగురి దుర్మరణం ■ పలువురికి తీవ్ర గాయాలు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. దొరకుంట సమీపంలో రహదారి పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీ బలంగా కొట్టింది. లారీలో భారీ ఇనుప కడ్డీలు ఉండటంతో ఢీకొన్న సమయంలో బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు.

### పలువురికి తీవ్ర గాయాలు

ప్రమాదంలో సుమారు 23 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు సమీపంలోని ఇతర ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో కొంతసేపు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

### సీఎం దిగ్భ్రాంతి

సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

## భూములు కబ్జా చేస్తున్న సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్ :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కబ్జాదారుడు అన్నారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కబ్జాదారులే 22Aకి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని హరీశ్‌రావు అన్నారు. కష్టపడి సంపాదించి ఆస్తులు కొనుగోలు చేసుకున్న ప్రజలు కబ్జాదారులు కాదని, వారి ఆస్తులను కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్న సీఎం అసలైన కబ్జాదారుడని ఆరోపించారు. ప్రజల భూములపై పెత్తనం చేయడం కాదు, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ, అసైన్డ్ భూములను సీఎం లాక్కుంటున్నారని మండిపడ్డారు.

## ఎంపీ అసదుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిజాబ్ ధరించడం ఇస్లాంలో తప్పనిసరి కాదని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఖండించారు. మా మతం.. మేమే నిర్ణయిస్తామన్నారు. ఇస్లాంకు ఏది అవసరమో, ఏది కాదో నిర్ణయించేది న్యాయమూర్తులు కాదన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ విద్యార్థి ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కోర్టు కొట్టివేసింది. ఇస్లాంలో హిజాబ్ తప్పనిసరి కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పును ఇస్లాంపై దాడిగా అసదుద్దీన్ అభివర్ణించారు.

## కొండా సురేఖ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ నివేదిక



**అక్షరటుడే, హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు నివేదిక అందించింది. ఆమె దానిని ఏఐసీసీకి సమర్పించనున్నారు. కొండా సురేఖ కూతురు సుష్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌తో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆమె ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ క్రమంలో పీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించింది. నివేదిక ఆధారంగా హైకమాండ్ సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## కరువు ఉన్నా సీఎం స్పందించడం లేదు



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ అన్నారు. అయినా కూడా సీఎం చంద్రబాబు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 52 శాతం లోటు వర్షపాతం ఉందని పేర్కొన్నారు. కరువు దారుణంగా ఉన్నా చంద్రబాబు కుంభకర్ణుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 688 మండలాలకు గాను 628 మండలాల్లో లోటు వర్షపాతం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కోస్తాలోనూ కరువు ప్రభావం ఎక్కువగా ఉందన్నారు.




## నాలుగు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంలో పాల్గొన్నారనే ఆరోపణలపై నాలుగు భారత ఆధారిత కంపెనీలు, ముగ్గురు భారతీయులపై అమెరికా ఆంక్షలు విధించింది. పోర్టీజ్ పార్ట్‌నర్స్ LLP, సదాశివ ఓవర్సీస్ లిమిటెడ్, PP సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రా ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఆ జాబితాలో ఉన్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే లక్ష్యంతో ఆ దేశంతో వ్యాపారం కొనసాగించే దేశాలను శిక్షిస్తామని ఈ వారం ప్రారంభంలో యునైటెడ్ స్టేట్స్ హెచ్చరించింది. ఈ క్రమంలో భారత కంపెనీలపై ఆంక్షలు విధించింది.

## రాష్ట్రానికి వర్ష సూచన

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో రాత్రి, గురువారం తెల్లవారుజామున వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. పశ్చిమ, ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో నేడు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయాల్లో పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.





## రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కంగనా రనౌత్ సెటైర్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ , కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. నటి కృతి సనన్ నటించిన ఓ రక్షా బంధన్ యాడ్ వివాదంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కంగనా తనదైన శైలిలో స్పందించారు. పితృస్వామ్యాన్ని కూల్చివేయాలంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్రంగా బదులిచ్చారు. మహిళల హక్కులు, ప్రాతినిధ్యం విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని కంగన తీవ్రంగా ప్రశ్నించారు. ‘‘బ్రో.. కాస్త ఆగు.. భారత్ మాతాకీ జై.. ఇక మీరు చెప్పాల్సింది మొదలుపెట్టండి’’ అంటూ వ్యంగ్యంగా స్పందించారు.

## ఐదుగురు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య

**అక్షరటుడే, కర్ణాటక:** కర్ణాటకలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయపుర సమీపంలోని భూతనాల చెరువులో మృతదేహాలు తేలియాడుతుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతులను శోభ జాలగెరి (45), ఆమె పిల్లలు విద్య (16), సువర్ణ (14), గౌడేష్ (10), శానిక (7), వికాస్ (5)గా గుర్తించారు. శోభ భర్త భీమరాయ మద్యానికి బానిసయ్యాడని, కుటుంబ పోషణ భారంగా మారడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆమె పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది.

